ఆక్రమణలో శిఖం భూములు..

- జామ్‌లో మోర్‌చెరువు శిఖం భూముల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు
- హద్దురాళ్లు ఏర్పాటు చేసుకున్న వైనం
- గ్రామంలోని మత్స్యకారుల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- భూముల సర్వేకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కసరత్తు


మోర్‌చెరువు


సాగు చేస్తున్న చెరువు శిఖం భూమి


శిఖం భూములు పరిశీలిస్తున్న సర్వేయర్, ఏఈ

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో మోర్ చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని.. వెంటనే స్పందించి పరిరక్షించాలని పలువురు మత్స్యకారులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల మోర్‌చెరువు శిఖం భూములను మండల సర్వేయర్ ప్రశాంత్, స్వర్ణ ప్రాజెక్టు ఏఈ మధుపాల్ పరిశీలించారు. మరో రెండు, మూడు రోజుల్లో శిఖం భూములను సర్వే చేసి ఎంతమేర ఆక్రమించారో తెలియజేసి.. ఎక్కడికక్కడ హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

మోర్‌చెరువు విస్తీర్ణం 257 ఎకరాలు ఉండగా.. వాటిల్లో శిఖం భూములు దాదాపు 80ఎకరాలున్నాయి. దాదాపు 20 ఎకరాల మేర శిఖం భూముల ఆక్రమణ జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

శిఖం భూములు సాగు చేస్తున్న రైతులు

మోర్‌చెరువు ఆయకట్టు పరిధి 300 ఎకరాలు. కాగా శిఖం భూములను కొందరు రైతులు యథేచ్ఛగా పొక్లెయినర్ల సహకారంతో చదును చేయించి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. మరికొందరు రైతులు శిఖం భూముల్లో మొరం పోయించి దర్జాగా సాగు పనులు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ అంతా బాహాటంగానే జరుగుతోంది. ఎవరికి వారు తమకు పట్టాలున్నాయని.. శిఖం భూముల్లో హద్దురాళ్లు పాతేసుకొని సాగు చేసుకుంటున్నారు.

హైలెవెల్ కాలువ దారులు సైతం..

మండలంలోని 27ప్యాకేజీ పనుల్లో భాగంగా తవ్విన ప్రాణహిత– చెవెళ్ల వరద కాలువకు ఇరువైపులా రహదారులను ఏర్పాటు చేసి వంతెనలు నిర్మించారు. కానీ ప్రస్తుతం రైతులు సదరు రహదారులను సైతం ఆక్రమించి పంటలను సాగు చేసుకుంటున్నారు. కాలువ నిర్మాణం సమయంలో వెడల్పుగా ఉన్న రహదారులు ప్రస్తుతం ఇరుకుగా మారాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనుక అధికారులు, నాయకులు స్పందించి చెరువు శిఖం భూములను, కాలువ భూములను పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు..

జామ్ మోర్‌చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామంలోని మత్స్యకారులు, కొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యా దు చేశారు. ఈమేరకు కలెక్టర్ నుంచి తమకు ఆదేశాలు అందాయి. చెరువు శిఖం భూముల స ర్వే చేసేందుకు చర్యలు చేపట్టాం. త్వరలో స మ స్య పరిష్కరిస్తాం.

– శ్రీదేవి, తహసీల్దార్

ఆక్రమిస్తే ఊరుకునేది లేదు

చెరువు శిఖం భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం. ఎవరైనా ఆక్రమిస్తే ఊరుకోబోం. చెరువు, ప్రాజెక్టు భూముల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ ఉంది. ఎవరైనా శిఖం భూములను రైతుల భూముల్లో కలిపేసుకుంటే అధికారులకు ఫిర్యా దు చేయాలి.

– మధుపాల్, ఏఈ, ఇరిగేషన్

పార్వతి–పరమేశ్వరుల కల్యాణం


అమ్మవారి తాళిబొట్టు చూపుతున్న పూజారి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆది దంపతులైన పార్వతి–పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున పట్టువస్త్రాలను ఎంపీపీ అడ్వాల పద్మ–రమేశ్ దంపతులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వోస రాజు, ఆలయ కమిటీ సభ్యులు ఈటెల శ్రీనివాస్, రవీందర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి


నమోదు పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను తప్పుల్లేకుండా ఈనెల 17లోగా ఆన్‌లైన్‌లో న మోదు చేయాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆపరేటర్లకు సూచనలు చేశారు. తహసీల్దార్ మోతీరాం, మండల ప్రత్యేకాధికారి రమేశ్, ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఉన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్ అన్నారు. వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో వసతులు, భోజనం, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో అనేకమంది విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. సన్నబియ్యం అందిస్తున్నామని గొప్పలు చెబుతూ క్షేత్రస్థాయిలమాత్రం దొడ్డు బియ్యం సరఫరా చేస్తుందని వాపోయారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి వార్డెన్లను నియమించాలని కోరారు. సాయినాథ్, దినేశ్, లక్ష్మణ్, సన్ని, శశి, నితీశ్ పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుపై వివాదం

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసే విషయమై గ్రామంలోని రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. గ్రామపంచాయతీ ఎదుట గతంలోనే విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ.. మళ్లీ పాఠశాల ముందు వీడీసీ స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సరికాదని ఓ వర్గానికి చెందిన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ముందు విగ్రహం ఏర్పాటు చేస్తే అన్ని విగ్రహాలు ఒకే చోట ఉంటాయని.. మరో వర్గం నాయకులు అధికారులకు విన్నవించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న సీఐ ఖానాపూర్ మోహన్, ఎస్సై లింబాద్రి అక్కడికి వెళ్లి ఇరువర్గాలతో మాట్లాడారు. విగ్రహం ఏర్పాటుపై సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొంది సమన్వయంతో సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

షీటీం సేవలపై అవగాహన

నిర్మల్‌టౌన్: ఆపదలో ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రిన్స్ హైస్కూల్‌లో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగా హన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, సైబర్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. పట్టణ ఎస్సై సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు

ఖానాపూర్: అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని పలువురు పేర్కొన్నారు. మండలంలోని గోసంపల్లెలో ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో డి జిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్‌పే, భారత్‌పే, గూగుల్‌పే తోపాటు యూట్యూబ్, సుకన్య సమృద్ధి యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో సభ్యులు చిన్నయ్య, రమ తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీ ఏర్పాటుకు మాజీ మంత్రే కారణం

- రైతులపై కేసులు వెంటనే ఎత్తివేయాలి
- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అతని కుమారుడే కారణమని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఫ్యాక్టరీ వ్యవహారంలో రైతులపై జరిగిన లాఠీఛార్జిని అదేరోజు ఖండించామన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు. ఫ్యాక్టరీ అనుమతులు రద్దయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. పదేళ్లపాటు మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండి, అనుమతులిచ్చి ఇప్పుడు నాకేమీ తెలియదనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గతంలో ఇంద్రకరణ్‌రెడ్డి మంత్రిగా ఉన్న అటవీ పర్యావరణశాఖ నుంచే క్లియరెన్స్ ఇచ్చారని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్ ఎక్సైజ్, టీఎస్ ఐపాస్ పరిశ్రమల శాఖ, నీటిపారుదల శాఖ నుంచి అనుమతులు ఇచ్చారన్నారు. ఈ ఆధారాలు చూపైనా మాజీ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించి ఇప్పుడు నాకేం తెలియదంటే నమ్మేందుకు నిర్మల్ ప్రజలు అమాయకులు కారన్నారు. భూములు అమ్మడం, కొనడం నిరంతర ప్రక్రియ అని ఫ్యాక్టరీ నిర్మాణానికి ముందు అనుమతులు ఎందుకిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఇంద్రకరణ్‌రెడ్డి అనుమతులు ఇవ్వడంతోనే ఇథనాల్ ఫ్యాక్టరీ వచ్చిందని.. ఇది వాస్తవం కాదని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో అంజుకుమార్ రెడ్డి, నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సాదం అరవింద్, తక్కల రమణారెడ్డి, ముత్యంరెడ్డి, వీరేశ్, శ్రావణ్, దిలావర్‌పూర్, గుండంపెల్లి రైతులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏబీవీపీ నాయకులు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్:ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జానకి షర్మిలను మంగళవారం పలువురు ఏబీవీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, జిల్లా కన్వీనర్ శశి, సాయినాథ్, దినేష్, లక్ష్మణ్, శశి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- ఇసుక అక్రమ దందాలను బంద్ చేయించాలి
- సదరం సర్టిఫికెట్లలో అధికారులు అక్రమాలకు పాల్పడొద్దు
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సా ధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అ న్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన జరిగిన ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి హా జరై మాట్లాడారు. అధికారులు ఇసుకను అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చ ర్యలు తీసుకోవాలని సూచించారు. తన హయాంలో దళారులు, పైరవీలకు ఆస్కారం లేదని.. స ద రం సర్టిఫికెట్ల జారీలో కొందరు అధికారులు రూ.5 నుంచి రూ.6వేలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

సదర్మాట్ రైతులకు సాగునీరు ఇవ్వాలి..

ఖానాపూర్, కడెం మండలాల జీవనాధారమైన సదర్మాట్ ఆయకట్టు రైతులకు యాసంగిలో సరిపడా సాగునీటిని అందించాలన్నారు. ఈనెల 4న తనతో నీటిని విడుదల చేయించిన అధికారులు కాలువ ద్వారా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ఇరిగేషన్ ఏఈఈ నవీన్‌ను నిలదీశారు. నీరందించకుంటే రైతుల పక్షాన ధర్నా చేస్తానని హెచ్చరించారు.

సమస్యలపై ఏకరువు..

బాదన్‌కుర్తిలో పశువైద్యం అందడం లేదని సర్పంచ్ శ్రీనివాస్, గోసంపల్లెలో విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం లేదని సర్పంచ్ గంగారాం పేర్కొన్నారు. తరచుగా ఐసీడీఎస్ సీడీపీవో సమావేశానికి గైర్హాజరవుతున్నారని ఎంపీపీ తెలుపగా.. సంబంధిత మంత్రి సీతక్కతో మాట్లాడుతానని పేర్కొన్నారు. పెంబి మండలం తాటిగూడలో పంచా యతీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపంపై పీఆర్ ఏఈని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నాణ్యత లోపించకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

భూమిపూజ

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో మంగళవారం ఎర్రన్న అనే రైతు చేనులో పశువులపాక నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏపీడీ గోవిందరావు, టీఏ రవీందర్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో బీపీఎం విజయలక్ష్మి, ఏపీఎం సునంద, సీసీ సందేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యాకరణ ప్రజ్ఞ పరీక్ష

ముథోల్: ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాకరణ ప్రజ్ఞ పరీక్ష నిర్వహించనున్నట్లు హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా డివిజన్ కన్వీనర్ జాదవ్ పుండలిక్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగే ఈ పరీక్షకు పదో తరగతి విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి కల్గినవారు 94413 33315 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పెంబి: మండలంలోని పసుపుల అటవీ సెక్షన్ పరిధిలోని కొరకంటి, గొందుగూడెం గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం ఆటవీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అడవిలో వన సంపద కాలిపోతే వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందని ఎఫ్ఎస్‌వో ప్రభాకర్ అన్నారు. ఎఫ్‌బీవో స్వాగత్ తదితరులున్నారు.

వసతిగృహం మంజూరుకు వినతి

కుభీర్: 365 మంది చదువుతున్న కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకువెంటనే సమీకృత వసతిగృహం మంజూరు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఎం.సోముకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వాగ్మారే మహేందర్, నాయకులు ఉన్నారు.

ఓపెన్ విద్యలో ప్రవేశాలు

కుంటాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం కోసం ఈనెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ వాటోలి ముత్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సగ్గం గంగాధర్ తెలిపారు. వివరాలకు 85558 38196 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

ఆకాశవాణిలో విద్యార్థుల కార్యక్రమాలు

కడెం: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదిలాబాద్ ఆకాశవాణి సిబ్బంది విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించారు. పాటలు, పద్యాలు, గొల్లసుద్దులు, తదితర కార్యక్రమాలను ఆకాశవాణి సిబ్బంది రికార్డ్ చేశారు. ఇందులో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఆకాశవాణి సిబ్బంది దినేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన సభ్యులు

ముథోల్: ఆదిలాబాద్‌లోని తన నివాసంలో ఎంపీ సోయం బాపురావును మంగళవారం ముథోల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల సమితి ప్రబంధకారిణి సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్మిస్తున్న శిశుమందిర్ పాఠశాల భవనానికి ఆర్థికసాయం అందించాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నగర్ నారాయణ్‌రెడ్డి, సమితి అధ్యక్షులు రవీంద్రనాథ్‌పాండే, సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, ప్రబంధకరాణి సభ్యులు ఉన్నారు.

సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోయి సాయిలు ఇటీవల ఉమ్మడి జిల్లా ప్రైవేట్ కళాశాలల అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యారు. మంగళవారం వారిని కళాశాలలో సన్మానించారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్–బెల్లాల్ మార్గంలో అంబేద్కర్‌నగర్ శివారులో దిలావర్‌పూర్ సమీపంలో రెంకోని వాగుపై వంతెన నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. రూ.5.20కోట్లతో జరిగే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం బాదనకుర్తి పంచాయతీలోని చింతల్‌పేట్‌తోపాటు ఖానాపూర్‌లోని పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో డీఈ మల్లారెడ్డి, ఏఈఈ విజయలక్ష్మి, అంకం రాజేందర్, చిన్నం సత్యం, అమానుల్లాఖాన్, రమేశ్, షబ్బీర్‌పాషా, ప్రతాప్‌రావు, గంగాధర్, బట్టు రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలన

ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును ఎమ్మెల్యే బొజ్జు పరిశీలించారు. దస్తురాబాద్ మండలానికి చెందిన జాతీయ సైక్లింగ్ క్రీడాకారిణి మౌనికకు సైకిల్ కొనివ్వాలని ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ నిర్వాహకులు కిషన్ ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తెలంగాణ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో, నిర్మల్ ఎంఎం డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షులు దయానంద్‌ను పరామర్శించారు. ఎంపీడీవో మల్లేశ్, చిన్నం సత్యం, అబ్దుల్ మాజిద్, రాజూనాయక్, జంగిలి శంకర్, నిమ్మల రమేశ్, గంగనర్సయ్య, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, తోట సత్యం, నారాయణ, శ్రీనివాస్, జహీర్ ఉన్నారు.

వేంకటేశ్వరాలయంలో తిరుప్పావై ఉత్సవం

మామడ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో మంగళవారం తిరుప్పావై వేడుకలను నిర్వహించారు. మహిళలు ఉదయం మంగళహారతులతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సీతారామచంద్రాచార్యులు, విజయ్‌సారథి తిరుప్పావై విశిష్టతను భక్తులకు వివరించారు.

ప్రారంభమైన జాతర

సారంగాపూర్: మండలంలోని బండరేవుతండాలో కొలువు దీరిన నానూ మహరాజ్ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి మంగీలాల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్లు పరిశీలించి క్రికెట్ జట్ల వివరాలను జాతర కమిటీ సభ్యులు సేకరించారు. రేపు ఉదయం క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని జాతర కమిటీ సభ్యులు దత్తూరాం, దావూజీ తదితరులు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. పాఠశాలలో జరిగిన ఆత్మీయ బదిలీ వీడ్కోలు సమావేశంలో హెచ్ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, మంజుల, శ్రీదేవి, హేమలతను సన్మానించారు.

కుభీర్‌లో మాక్ పోలింగ్

కుభీర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలు, ఎన్ని కల సంఘం విధులు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. అక్షయ్, సా యిబాబా అభ్యర్థులుగా పోటీపడగా విద్యార్థులు ఓటు వేసి అక్షయ్‌ను ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు జె.సాయన్న, సీఆర్పీలు ఆనంద్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: గాజులపేట 11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట్, కొమ్ము నారాయణ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలాన్లు చెల్లించాలి

ఖానాపూర్: వాహనదారులు ఈనెల 10లోగా పెండింగ్ ఈ–చలాన్లు చెల్లించుకోవాలని ఎస్సై లింబాద్రి కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బైక్, ఆటోలపై 80శాతం, కార్లపై 60శాతం, ఇతర బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం డిస్కౌంట్ ఉందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బస్సు నడిపించాలని వినతి

లోకేశ్వరం: మండలంలోని బామ్ని(కే) గ్రామానికి బస్సు నడిపించాలని లోకేశ్వరం వీడీసీ సభ్యులు మంగళవారం భైంసాలో డిపో మేనేజర్ అమృతకు వినతిపత్రం అందజేశారు. గతంలో భైంసా నుంచి లోకేశ్వరం, గడ్‌చాంద మీదుగా బస్సు బామ్నికేకు చేరుకునేదని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం తర్వాత బస్సును బంద్ చేశారు. అధికారులు స్పందించి మళ్లీ బస్సును పునరుద్ధరించాలని వీడీసీ సభ్యులు కోరారు. వీడీసీ చైర్మన్ అంబకంటి శ్రీనివాస్, రాజశేఖర్, లక్ష్మణ్‌రావు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.నాలుగు వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అదే పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కాశీరాం పంపిణీ చేశారు. గడ్‌చాంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.8 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను విశ్రాంత ఉపాధ్యాయుడు చట్ల ధర్మన్న పేరిట భైంసా మండలం వానల్‌పాడ్ పంచాయతీ కార్యదర్శి గాయత్రి అందజేశారు. లోకేశ్వరం ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయుడు నవీన్ తదితరులు ఉన్నారు.

షేక్ ఫాతిమాకు నివాళి


పూలమాల వేస్తున్న నాయకులు

కడెం: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి నిర్వహించారు. మైనార్టీ నాయకులు మహమ్మద్ సలీం, అబ్దుల్ రహీంలు షేక్ ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం శ్రీనివాస్, గంగారాం, షేక్ వాహబ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే), బోరిగాం, తిర్పెల్లిలో, పీచర, ధర్మారం, న్యూకంజర్, మునిపెల్లి గ్రామాల్లో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభలను సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా 2022–23లో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులు, ఖర్చు వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టిన పనులు పరిశీలించారు. ఇందులో సర్పంచ్‌లు హైమావతి, కృష్ణారెడ్డి, లక్ష్మి, శోభారాణి, రాజేందర్‌రెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారం చేయొద్దు


దుకాణాలు తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

నిర్మల్‌టౌన్: ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారం చేయవద్దని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగే ప్రదేశాల్లో రోడ్లపై వ్యాపారం నిర్వహిస్తున్న వీధి వ్యాపారులపై కొరడా ఝుళిపించారు. న్యూసెన్స్ యాక్ట్ కింద వారి సామాన్లు తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

'రూమ్ టు రీడ్' పరిశీలన


విద్యార్థులతో చదివిస్తున్న గోవర్ధన్

మామడ: మండలంలోని నల్దుర్తి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం రూమ్ టు రీడ్ కార్యక్రమ కోఆర్డినేటర్ గోవర్ధన్‌నాయుడు సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో పలు పుస్తకాలు చదివించారు. కథల పుస్తకాలు చదివించి పఠననైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు.